నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, గ్రీన్ బవార్చి, రైల్వే స్టేషన్ ఏరియాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.
- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో..
- శ్రీలా ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి మధ్యాహ్నం 3.00 వరకు శ్రీలా విల్లాస్, కల్వరి చర్చి, వాటర్ వర్క్స్ ఏరియాలలో..
- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 3.00 గంటల వరకు విశ్వంభర, శిల్పా అవెన్యూ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధి హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు ప్రకాష్‌నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నామన్నారు.

6న సీతారాముల కల్యాణం

రాయదుర్గం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 6వ తేదీ టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు బాబా కాకడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. తర్వాత క్షీరాభిషేకం చేస్తారన్నారు. 10 నుంచి 12 గంటల వరకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ ,సాయంత్రం 4 గంటలకు షిర్డీసాయిబాబా, సీతారాముల శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. తదనంతరం సంధ్యా హారతి, రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆల్విన్ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఈస్ట్ సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో 6న శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు ఎస్. కపిల్ రాజు, సురభి రమేష్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సీతారాముల కల్యాణం, అనంతరం 4 వేల మంది భక్తులకు అన్నదానం సాయంత్రం 7 గంటలకు లవకుశ నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ప్రశాంతి



డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వి.ప్రశాంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను శేరిలింగంపల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.ముకుంద్ రెడ్డి పదవీ విరమణ చేశారు. బాధ్యతలు చేపట్టిన ప్రశాంతికి సర్కిల్ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్.. 11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, ఎనిమిది మందికి రూ .1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వృథాగా వాటర్ ఏటీఎంలు

లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినా ఫలితం నిల్ ● వేసవిలోనూ పట్టించుకోని అధికారులు



చందానగర్ పీజేఆర్ స్టేడియం ముందు నిరుపయోగంగా ఉన్న వాటర్ ఏటీఎం సెంటర్



చందానగర్ సర్కిల్ కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ఏటీఎం

చందానగర్: లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు నిరుపయోగంగా మారాయి. ప్రజల దాహార్తి తీర్చడానికి 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేశారు. కొన్ని నెలల పాటు ఇవి బాగానే పనిచేసినా నిర్వహణ లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి. వేసవిలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, స్వచ్ఛంద సంస్థలు కలిసి గతంలో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేశాయి. వాటర్ ఏటీఎంలలో రూపాయి నాణాలు వేస్తే తాగునీరు వస్తుంది. చందానగర్‌లో జన సంచారం ఎక్కువగా ఉన్న చోట ఒక సెంటర్ , పీజేఆర్ స్టేడియం వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. క్రీడాకారులు, వాకర్స్‌కు వాటర్ ఏటీఎం ఎంతో ఉపయోగకరమని ఏర్పాటు చేశారు. తదనంతరం పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వాటర్ ఏటీఎంలకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



వాటర్ ఏటీఎంలో తుప్పపట్టి విరిగిపోయిన కుళాయి

- చందానగర్ సర్కిల్ పరిధిలో వేసవి దాహార్తి తీర్చేందుకు వాటర్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావాలి
- పీజేఆర్ స్టేడియంకు భారీగా వాకర్స్, క్రీడాకారులు, వ్యాయామం కోసం వస్తుంటారు. వెంటనే వాటర్ ఏటీఎంను బాగుచేయాలని కోరుతున్నారు
- వాటర్ ఏటీఎంలలో అర లీటర్, లీటర్, 5 లీటర్ల సామర్థ్యం గల కుళాయిలను అందుబాటులోకి తీసుకురావాలి.
- వాటర్ ఫిల్టర్ విషయంలో కూడా నాణ్యమైన యంత్ర పరికరం వాడాలి.
- చల్లని తాగునీరు ఏర్పాటు చేయడంతో బాటు 24 గంటల పాటు వాటర్ ఏటీఎం పని చేసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు .

అందుబాటులోకి తీసుకురావాలి



చందానగర్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఏటీఎంలను అధికారులు బాగుచేసి అందుబాటులోకి తేవాలి. లక్షలు వెచ్చించి వాటిని పట్టించుకోకపోవడంతగదు. ఇప్పటికై నా వెంటనే అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– విష్ణువర్ధన్ చారి, చందానగర్

అధికారులు స్పందించాలి



ఎండలు పెరుగుతున్నాయ్. దాహార్తికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగం. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు వాటర్ ఏటీఎంలతో బాటు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. ఎండాకాలం కనుక సత్వరం స్పందించాలి.

–బాలకృష్ణ, చందానగర్

కాసేపు చెట్ల నీడన..

గచ్చిబౌలి: విద్యార్థులు, నిరసనకారుల ఆలజడితో మూడు రోజులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సీపీఎం, బీజేవైఎం నాయకుల రాకతో పోలీసులు ఎండలోనే విధులు నిర్వహించారు.అలాగే బుధవారం మధ్యాహ్నం వరకు ఎండలో నిలబడిన పోలీసులు లంచ్ తరువాత కొంత సేపు చెట్లు, టెంట్ నీడలో సేదదీరారు.



టీహబ్‌లో 20 అత్యుత్తమ స్టార్టప్‌ల ఎంపిక

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) ద్వారా 5వ కోహర్ట్ కార్యక్రమంలో టీహబ్ ఏపీసీ హెల్త్ కేర్ ప్రోగ్రామ్‌లో భాగంగా 209 దరఖాస్తులు రాగా అందులో అత్యుత్తమమైనవిగా 20 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు బుధవారం రాత్రి తెలిపారు. మూడు నెలల హైబ్రిడ్ కార్యక్రమంలో ఎంపికైన స్టార్టప్‌లకు మెంటర్‌షిప్, మార్కెట్ యాక్సెస్, పెట్టుబడిదారులతో అవగాహన, మార్గదర్శకత్వాన్ని అందించనున్నారు. ముఖ్యంగా మెడ్‌టెక్, డిజిటల్ హెల్త్, హెల్త్ కేర్ యాక్సెసిబిలిటీలో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ప్రత్యేక పూజలు.. బోనాల వేడుకలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లోని శ్రీ విజయదుర్గా భవానీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు.. బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఆలయంలో అన్నదానం చేశారు. కాగా ఈ ప్రాంతంలో ఉగాది తర్వాత బోనాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, రవీందర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు అశోక్, సత్తి కుమార్, శ్రీనివాస్, గోపాల్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతివ్వాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని సర్వే నంబర్145, 163లోని సర్దార్‌పటేల్ నగర్, వసంత్‌నగర్, భగత్‌సింగ్ నగర్ ఫేజ్ 1, 2, సీబీసీఐడీ, శిల్పా, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ, డైమండ్ ఎస్టేట్ పరిధిలోగల ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం ఆయా కాలనీల అధ్యక్షులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా నివాసముంటున్న ఈ ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వారి స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నా కూడా ప్రభుత్వం అనుమతి నిరాకరించడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై స్పందించి ప్రజలకు మేలు కలిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్‌ఎస్ కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగిరెడ్డి, హనుమంతరావు, సాంబశివరావు, ప్రభాకర్, రామారావు, శిల్పా ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని మియాపూర్ ఆల్విన్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, వినయ్‌కుమార్‌గౌడ్, బాలింగ్ గౌతమ్‌గౌడ్, లీలానందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం కర్దనూర్ గ్రామంలో శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్య పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు.బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో అమీదా ఆస్పత్రి నుండి పద్మావతి అపార్ట్‌మెంట్ వరకు మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని, మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. రోడ్డుపై మురుగు నీరు నిలవకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు.

ఫ్లై ఓవర్ పనుల పరిశీలన

గచ్చిబౌలి: గచ్చిబౌలి–కొండాపూర్ ఎడమవైపు సర్వీస్‌రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ సీఈ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలి–కొండాపూర్ వరకు నిర్మించిన శిల్పాలేఔట్ ఫ్లైఓవర్ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సర్వీస్‌రోడ్డులో విద్యుత్ పరికరాలను తొలగించేందుకు స్థల సమస్య ఉన్న నేపథ్యంలో సర్వీస్‌రోడ్డు చేపట్టలేక పోయినట్లు ఏజెన్సీ వివరించడంతో అక్కడే ఉన్న ప్రాజెక్ట్ ఈఈ తొందరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్‌కుస్పష్టమైన స్థలం లేకపోవడంతో జాప్యానికి కారణమన్నారు, ఓల్డ్‌బొంబాయి హైవేలో సమగ్ర జంక్షన్ అభివృద్ధికి అవసరమైన ఆస్తుల సేకరణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిప్యూటీ ఈఈ హరీష్, ఎస్‌ఈ, ఈఈ కన్సల్టెంట్ నిర్మాణ చేసే ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కొండాపూర్–గచ్చిబౌలి సర్వీస్‌రోడ్డును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ సీఈ భాస్కర్‌రెడ్డి

రోడ్లకిరువైపులా ఆక్రమణలు తొలగించండి

ఫిలింనగర్: ఫిలింనగర్ సొసైటీ కార్యాలయం చుట్టుపక్కల, మహనీయుల చౌరస్తా, ఇలా రోడ్లకిరువైపులా ఆక్రమణలు తొలగించాలని ఫిలింనగర్ కాలనీవాసులు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కొన్నేళ్లుగా ఫిలింనగర్ సొసైటీలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లకిరువైపులా ఏర్పాటుచేసిన డబ్బాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఏసీపీ సానుకూలంగా స్పందించారని త్వరలోనే ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

ఫిలింనగర్: పోక్సో కేసులో ఫిలింనగర్ పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌లో నివసించే చిర్ల నాగవేంద్ర అలియాస్ సాయి (22) జులాయిగా తిరుగుతుంటాడు. 5వ తరగతి చదువుతున్న ఓ బాలిక (11) ఉగాది పండుగ కోసం ఫిలింనగర్‌కు వచ్చింది. రాత్రి 7 గంటల సమయంలో తల్లి పని కోసం బయటకు వెళ్లగా, నాగవేంద్ర ఒంటరిగా ఉన్న బాలికను చేయి పట్టుకొని బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు పెడుతూ బయటకు పరుగులు తీసింది. ఈ విషయం బాధితురాలి తల్లికి చెప్పగా తల్లి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మాదాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... సైబర్ టవర్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ కింద ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని, యాష్ కలర్ జీన్స్, చెక్స్ షర్ట్‌ను ధరించి ఉన్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ



చందానగర్‌లో లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్ తదితరులు

చందానగర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, పేదల కడుపునిండా అన్నం పెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో నిర్వహించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో సన్న బియ్యం రూ.40 నుంచి రూ.60 వరకు ఉన్నాయని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రేషన్ షాపులు పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, ఆర్ఐ శ్రీనివాస్, సివిల్ సప్‌ల్ై అధికారులు డీఎస్‌ఓ శ్రీనివాస్, ఏఎస్‌ఓ పుల్లయ్య, నియోజకవర్గం కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 80 రేషన్ షాపులు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 80 రేషన్ షాపులు ఉన్నాయని ఇందులో శేరిలింగంపల్లి మండలంలో 53, కూకట్‌పల్లి మండలంలో 27 ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి మండలంలో రేషన్ కార్డులు 57,161, లబ్ధిదారులు 1,79,307 ఉన్నారని వీరందరికి ఒక నెలకు 1099 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరముంటుందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తా..

శేరిలింగంపల్లి నియోజకవర్గం అతిపెద్ద నియోజకవర్గం అని ,ఇటీవల శేరిలింగంపల్లి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.400 కోట్లు ఇస్తానన్నారు. అవి సరిపోవని చెప్పడంతో రూ.1600 కోట్లు విడుదల చేస్తానని సీఎం హామీ ఇచ్చారన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి రెండవ వార్డులోని రేషన్ దుకాణంలో బుధవారం ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ ఓటర్ నమోదు అధికారి రంగారావు

పటాన్‌చెరు టౌన్: తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని పటాన్‌చెరు సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ రంగారావు అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ... ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్లు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూత్ లెవల్ సహాయకులను నియమించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు శివకుమార్, బీఎస్పీ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు టౌన్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కోరారు. బుధవారం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు.గాంధీ థీమ్ పార్క్ పక్కనే ఉన్నటువంటి ట్రయాంగిల్ బిట్ 2021వ సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ రూ. 3 కోట్ల నిధులతో నిర్మించారని, కాలక్రమేణా పార్కు నిర్వహణ లోపం వల్ల వాటర్ ఫౌంటెన్‌లో నీరు రావడం లేదని, విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదని వివరించినట్లు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

అదేవిధంగా జే.పీ కాలనీలో సీసీ రోడ్డు, యాదవ సంఘం శ్మశాన వాటిక వద్ద అప్రోచ్ రోడ్డులకు నిధులు కేటాయించాలని కమిసనర్‌ను కోరినట్లు తెలిపారు.